విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 04, ఏప్రిల్ 2024

రాష్ట్రాన్ని రుణాంధ్రప్రదేశ్‌గా మార్చిన జగన్ రెడ్డి

విశాలాంధ్ర–అవుకు: జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో ఏపీ రాష్ట్రాన్ని రుణాంధ్రప్రదేశ్‌గా మార్చాడని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి వైకాపా ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. అవుకు పట్టణంలోని తెదేపా నాయకుడు చల్లా విజయభాస్కర్ రెడ్డితో కలిసి చల్లా స్వ గృహంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే చల్లా విజయభాస్కర్ రెడ్డితో కలిసి అన్ని ప్రాంతాల్లో ప్రచారం నిర్వహిస్తామన్నారు. ప్రజలంతా టిడిపి వైపే ఉన్నారన్నారు. వైకాపా ప్రభుత్వం వృద్ధాప్య పింఛన్లు వాలంటీర్ల ద్వారా నిబంధనలకు విరుద్ధంగా పంపిణీ చేసేందుకు కుట్ర పడుతుందన్నారు. కొందరు వలంటీర్లు వైకాపా కార్యకర్త ల్లాగా వ్యవహరిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలను గాలికొదిలేసి ప్రభుత్వ డబ్బును వాడుకున్నారని, ప్రభుత్వం దగ్గర డబ్బులు లేక పోవడం సిగ్గుచేటన్నారు. పింఛన్ల పంపిణీ వ్యవహారంపై టీడిపి పై అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. రెండు లక్షల పైగా సచివాలయ ఉద్యోగులు ఉన్నారని, పింఛన్లను పంపిణీ చేసేందుకు సరిపడా ఉద్యోగులు ఉన్నారన్నారు. టిడిపిపై అసత్య ఆరోపణలు చేస్తే ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. తెదేపా ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు బ్రహ్మాండంగా ఉన్నాయని, అధికారంలోకి వచ్చిన వెంటనే పథకాలన్నిటినీ అమలు పరుస్తామన్నారు. వృద్ధాప్య పింఛన్‌ను రూ. 3వేల నుండి రూ. 4 వేలకు పెంచి ఇంటి దగ్గరకే వచ్చి అందిస్తామన్నారు. అర్హులైన వారందరికీ సూపర్ సిక్స్ పథకాలను ఎలాంటి నిబంధనలు లేకుండా ఇంట్లో ఎంతమంది ఉంటే అందరికీ అందిస్తామని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులు పాలు చేసి విద్యుత్ బిల్లులను పెంచి అధికంగా వసూలు చేస్తు న్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో చల్లా విజయభాస్కర్ రెడ్డి తో పాటు కాశీపురం మోట్ల రామిరెడ్డి, కాట్రెడ్డి మల్లికార్జున్ రెడ్డి, వంగల పరమేశ్వర రెడ్డి, ఉప్పలపాడు ఇస్మాయిల్ ఖాన్ పాల్గొన్నారు.

వైసీపీనివీడి టీడీపీలో చేరిక : బీసీ జనార్దన్ రెడ్డి సమక్షంలో పట్టణానికి చెందిన 35 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. టీడీపీలో చేరిన వారిలో మిద్దె ప్రసాద్, కుళ్లాయి, గుర్రాల రామాంజనేయులు, అక్కప్ప శీనుతో పాటు మరికొన్ని కుటుంబాలు తెదేపాలో చేరాయి. వీరికి బీసీ జనార్దన్ రెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అన్ని విధాలుగా అండగా ఉంటూ సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో దంతెల రమణ, వెంకటరమణా నాయక్, తిక్కన్న తిరుమల నాయక్, వెంకటరాముడు నాయక్ తదితరులు ఉన్నారు.

మరోసారి ఎమ్మెల్యేగా ఆశీర్వదించండి : శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి

విశాలాంధ్ర – నంద్యాల : ప్రతి ఒక్కరిని చిరునవ్వుతో ఆప్యాయతగా పలకరిస్తూ మరోసారి ఎమ్మెల్యేగా ఆశీర్వదించండని వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. నంద్యాల పట్టణ 33వ వార్డు జ్ఞానాపురంలో వార్డు కౌన్సిలర్ ఎద్దు మనోరంజని, వార్డ్ ఇంచార్జ్ ఎద్దు రవికుమార్ ఆధ్వర్యంలో వైసీపీ అభ్యర్థి ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చిక్కటి చిరునవ్వుతో ఆప్యాయతతో ప్రతి ఒక్కరిని పలకరిస్తూ వచ్చే ఎన్నికలలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా రవిచంద్ర కిషోర్ రెడ్డిని, ఎంపీ అభ్యర్థిగా పోచా బ్రహ్మానందరెడ్డిని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉండి రాష్ట్ర ప్రజలకు ఏం చేశావని, ఒక్కసారి ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి చేసిన వాటిలో పది శాతం కూడా చేయలేక పోయావన్నారు. టీడీపీ నాయకులు ఎన్నికల సమయంలో తప్పుడు వాగ్దానాలు చేసి ఓట్లు వేయించుకున్న తర్వాత వారిచ్చిన మేనిఫెస్టోను పక్కన పడేయడం తప్ప ప్రజలకు ఒక మంచి చేసిన పాపాన పోలేదన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ లు గంగిశెట్టి శ్రీధర్, పామ్షావలి, సచివాలయాల కన్వీనర్ దాల్మిల్ అమీర్, వార్డు వైసిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యమ నేత సుగుణమ్మ మృతి

- నేలరాలిన ఉద్యమ ఎర్రమందారం సుగుణమ్మ
- సుగుణమ్మ మృతి తీరని లోటు
- సీపీఐ జిల్లా జి కార్యదర్శి ఎన్. రంగ నాయుడు

విశాలాంధ్ర –డోన్ : మహిళా హక్కుల కోసం, అభాగ్యుల కోసం, అండగా నిలిచి మహిళ ఉద్యమ నేత రెడ్డిపోగు సుగుణమ్మ (58) బుధవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి. సుంకయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కే రాధాకృష్ణ, మోటారాముడు, సీపీఐ మండల పట్టణ కార్యదర్శి ఎస్. పులి శేఖర్, బి. నారాయణ, కర్నూలు జిల్లా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి రామ కృష్ణారెడ్డి, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి కె. ప్రభాకర్ ఏఐటీయూసీ డోన్ కార్యదర్శి అబ్బాస్, నాయకులు గౌండ బాష, మహిళా సంఘం నేతలు సెమీమ్ బేగం, జీ. లక్ష్మీదేవి, హసీనా, ప్రమీల అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నేతలు జులేక, మనోహరమ్మ, ఎస్తర్, చాందిని అంగన్వాడి ప్రభుత్వ అధికారులు సిడిపిఓ సూపర్వైజర్లు సహాయకులు వివిధ ప్రజాల సంఘాల నాయకులు సూర్య ప్రతాప్, రంగస్వామి, లు ఆమె మృత దేహానికి పూలమాలలు వేసినివాళులర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి రంగ నాయుడు మాట్లాడుతూ అంగన్వాడి కార్యకర్తగా జీవితం ప్రారంభించి అనేక సామాజిక అంశాలపై పోరాటం చేస్తూ ఎంతోమంది మహిళల అండగా నిలిచి ఆ బాగ్యులకు ఎలాంటి జీవన ఆధారం లేని వారి జీవితాలకు అర్థం చూపిన గొప్ప మహిళ నాయకురాలన్నారు. ఓ వైపు మహిళలకు అండగా, మరోవైపు ఎర్ర జెండా చేతబట్టి ఎర్రమందారంలా ఉన్న సుగుణమ్మ నేలరాలిందన్నారు. రాష్ట్రంలో మహిళలకు ఎక్కడ న్యాయం జరిగిన మహిళా హక్కులకు భంగం కలిగిన ఎదిరించి ధైర్యంగా పోలీసుల సైతం లెక్కచేయకుండా ఉద్యమాలు నడిపిన వీర వనిత కామ్రేడ్ సుగుణమ్మ అన్నారు. ఫ్యామిలీ కౌన్సిలింగ్ మెంబర్గా ఉండి అనేకమంది కుటుంబ సభ్యులకు బాసటగా నిలిచిన ఉద్యమ నేత సుగుణమ్మ ఆమె మరణం తీరనిలోటని వారన్నారు.

సుగుణమ్మ మృతి పట్ల సీపీఐ, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు సంతాపం : మహిళా ఉద్యమ నేత ఆకాల మరణం పట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే. రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఓబులేష్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే. రామాంజనేయులు, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రనాథ్, వెంకటసుబ్బయ్య, చలసాని రామారావు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి .దుర్గ భవాని, విమల, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జే లలితమ్మ, మునెప్ప సంతాపం తెలియజేశారు.

సుగుణమ్మ మృతి ఏఐటీయూసీకి తీరని లోటు : జి.ఓబులేసు

మృతురాలు ఆర్.సుగుణమ్మ

విశాలాంధ్ర –డోన్ : కార్మికుల పక్షపాతిగా అనేక ఏళ్ల నుండి ఏఐటీయూసీ ఉమ్మడి కర్నూలు జిల్లా నాయకురాలుగా అంగన్వాడి వర్కర్స్ అసోసియేషన్ జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయిలో పని చేసిన కామ్రేడ్ ఆర్. సుగుణమ్మ అనారోగ్యంతో బాధప డుతూ మృతి చెందడం ఏఐటియుసికి తీరని లోటని, ఈ సందర్భంగా సుగుణమ్మ కుటుంబానికి సానుభూతి సంతాపాన్ని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఓబులేసు, ఏఐటీ యుసి నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి పి సుంక య్యలు ఒక ప్రకటనలో తెలిపారు. సుగుణమ్మ గత అనేక సంవత్సరాలుగా అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఎదుర్కొంటున్న సమస్యల పరి ష్కారం కోసం ఉమ్మడి రాష్ట్రం నుండే అనేక ఉద్య మాలు నడపడం కోసం మొట్టమొదటిగా అంగ న్వాడీ యూనియన్ ఏర్పాటు చేయడంలో సుగు ణమ్మ లలితమ్మ మరి కొంతమంది కీలక పాత్ర వహించారన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నుండి రాష్ట్రంలో అనేక జిల్లాలకు యూనియన్ విస్తరింప చేయడానికి వీరు చేసిన ఉద్యమాలు స్ఫూర్తిగా నిలిచాయన్నారు. కార్మికులు పేదలు సమస్యలు ఏమున్నా సరే సమస్యల పరిష్కారం కోసం కనీస వేతనం కావాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కార్మికు లకు పేదలకు మనుషులంతా సమానంగా జీవించడానికి స్వాతంత్ర ఫలాలు అందరికి అందాలని, నిత్యం తపన పడుతూ అనేక పోరాటంలో నిక్కచ్చిగా నిలబడి. అధికారులు, పోలీసులకు భయపడక కార్మికులు పేదలకు అండగా నిలబడడం సుగుణమ్మ ప్రత్యేక శైలి అని వారన్నారు. ఇంకా భవిష్యత్తులో కార్మికులకు పేదలకు ఎర్రజెండా నాయకత్వనా పేదలకు న్యాయం జరిగేందుకు ఎన్నో పోరాటాలలో భవిష్యత్తులో పాల్గొనాల్సి ఉన్నా సరే అకస్మాత్తుగా ఇటీవల జరిగిన అంగన్వాడీ వర్కర్స్ 42 రోజులు సమ్మెలో కీలక పాత్ర వహించి ఉద్యమంలో నిక్కచ్చిగా నిలబడి పోరాటంలో ముందు ఉండడం ఆ పోరాటంలోనే క్యాన్సర్ జబ్బుతో కళ్ళు తిరిగి పడిపోయి హాస్పటల్లో చికిత్స పొందుతూ క్యాన్సర్ జబ్బుతో పోరాడి మరణించడం చాలా బాధాకర మన్నారు. కర్నూలు జిల్లా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునేప్ప, నాయకులు అజయ్ బాబు, కృష్ణ, చంద్రశేఖర్, నంద్యాల జిల్లా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రఘురామమూర్తి, జిల్లా నాయకులు లక్ష్మీనారాయణ, అబ్బాస్, రమేష్ బాబు, బాలకృష్ణ, ప్రసాద్, శ్రీశైలం నాగిరెడ్డి, భాస్కర్, డి శ్రీనివాసులు, పుల్లయ్య, సురేంద్ర, జులేఖ, ఎస్తేరమ్మ, చాందిని, స్వర్ణలత పరామర్శించి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు, సీపీఐ ఏఐటీయూసీ ప్రజాసంఘాల నాయకులు అందరూ సుగుణమ్మ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. సుగుణమ్మ మరణవార్త తెలియగానే వందలాది మంది అంగనవాడి కార్యకర్తలు, ఐసీడీఎస్‌అధికారులు వచ్చి సుగుణమ్మ పార్థివదేహాన్ని చూసి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

సుగుణమ్మ ఆత్మకు శాంతి కలగాలి

విశాలాంధ్ర – నందికొట్కూరు : అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్స్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్య దర్శిగా కామ్రేడ్ సుగుణమ్మ కార్మికుల పక్షపాతిగా అనేక ఏళ్ల నుండి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పని చేయడం జరిగిందని, బుధవారం అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడం బాధాకరమని, ఉద్యమానికి తీరనిలోటు అని, ఆమె ఆత్మకు శాంతికలగాలని, కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేయడం జరిగిందని ఏఐటీయూసీ జిల్లా నాయకులు రఘురామమూర్తి తెలిపారు.

తర్తూరు జాతరలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి

విశాలాంధ్ర–జూపాడుబంగ్లా: రాయలసీమలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగే తర్తూరు శ్రీ రంగనాథ స్వామి జాతరకు వచ్చే వేలాది మంది ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని మౌలిక సదుపాయాలు తాగునీరు, టెంట్లు, వైద్య శిబిరాలు, విద్యుత్తు, అన్ని అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా నాయకులు ఎం. రమేష్ బాబు కోరారు. బుధవారం తర్తూరు శ్రీ రంగనాథ స్వామి జాతర విజయవంతం కై అన్ని శాఖల అధికారుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ తర్తుర్ రంగనాథ స్వామి జాతరకు వేలాది మంది ప్రజలు భక్తులు తరలివస్తారని ప్రస్తుతం ఎండలు విపరీతంగా ఉన్నాయని ప్రజలకు వడ దెబ్బ తగిలే అవకాశాలు ఉన్నాయని కావున ప్రజలకు అందుబాటులో త్రాగునీరు నీడ టెంట్లు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు వారన్నారు. జాతరలో అక్రమ వసూళ్లు అరికట్టాలన్నారు. ముఖ్యంగా విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని వారు కోరారు. జాతరలో ఎలాంటి సమస్యలు రాకుండా విజయవంతం అయ్యేలా అన్ని శాఖల అధికారులు దృష్టి కేంద్రికరిస్తే జాతర విజయవంతం అవుతుందన్నారు.

టీడీపీలో చేరిన దళిత కుటుంబాలు

విశాలాంధ్ర – వెలుగోడు : పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన 40 దళిత కుటుంబాలు బుధవారం టీడీపీ లో చేరారు. తెలుగుదేశం పార్టీలో చేరిన వారు ఏర్వ ప్రసాద్, దాసరి చెన్నయ్య, ఏర్వ ప్రవీణ్ కుమార్, కాటేపోగు నాగన్న, బాదం గని మద్దిలేటి టీడీపీ నాయకుడు జాకటి చంద్ర ఆధ్వర్యంలో శ్రీశైలం అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖర రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి మాజీ ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి సాదారణంగా ఆహ్వానించారు. టిడిపి ప్రభుత్వం దళితుల అభివృద్ధి కి కట్టుబడి ఉందని అన్నారు.

భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఏర్పాటు

విశాలాంధ్ర – శిరివెళ్ల : మండల పరిధిలోని యర్రగుంట్ల మేజర్ పంచాయతీ గ్రామంలో గల విమల ఇంగ్లీష్ మీడియం స్కూల్లో జిల్లా సెక్రెటరీ లింగారెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్ రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ ఏర్పాటు చేశారు. విద్యార్థిని విద్యార్థులలో సహనం స్నేహశీలత ఉత్సాహం పట్టుదలను పెంపొందించేందుకు గాను 32 మంది బాలురు 32 మంది బాలికలతో మొత్తం 64 మంది విద్యార్థిని విద్యార్థులతో స్కౌట్స్ అండ్ గైడ్స్ ను మేనేజ్మెంట్ ఆంతోని చేతుల మీదుగా ప్రారంభించారు. విద్యార్థి దశ నుండే సేవా పద్ధతులను అనుసరించి శిక్షణ ఇస్తారనీ. ఈతకొట్టడం, వంతెనలు, రోడ్ల నిర్మాణం, ప్రథమ చికిత్స పద్ధతులను నేర్పుతారనీ ప్రధానోపాధ్యాయురాలు అన్నా గ్రేస్ అన్నారు. ఆయుధాలు లేకుండా వీరు కేవలం ఒక కర్రను మాత్రమే ధరిస్తారనీ వీరికి సైనికుల వలె ప్రత్యేక దుస్తులు మెడలో ఒక స్కార్ఫ్ ఉంటుందనీ హెచ్ ఎం పేర్కొన్నారు. సత్యం పలకడం, కష్టాలలో ఉన్నవారిని ఆదుకోవడం, రోగగ్రస్తులకు సేవచేయడం, పోలీసు వ్యవస్థకు అత్యవసర సమయాల్లో సాయపడటం ద్వారా బాలభటులు గా సమాజసేవ చేయవచ్చుననీ తెలిపారు. పాఠశాలకు బాలబట్టులకు మధ్య ముఖ్య అధికారిగా కె. జ్యోతి టీచర్ ను నియమించినట్లు హెచ్‌ఎం అన్నా గ్రేస్ పేర్కొన్నారు.

రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యం : లక్ష్మి నరసింహ యాదవ్

విశాలాంధ్ర – నంద్యాల : రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే మన అందరి లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే పదేళ్ల ప్రత్యేక హెూదా ఇవ్వడం జరుగుతుందని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే విజయమని నంద్యాల పార్లమెంట్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు లక్ష్మి నరసింహ యాదవ్ పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ భవన్ నంద్యాల పార్టీ కార్యాలయం నందు నంద్యాల నియోజవర్గం సమీక్ష సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నంద్యాల పార్లమెంట్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు లక్ష్మి నరసింహ యాదవ్ పాల్గొని మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం కొరకు మనమందరం కలిసి కట్టుగా పనిచేయాలని దిశ నిర్దేశం చేశారు. మన అందరి లక్ష్యం ఒకటే కేంద్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని, రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయాలని, ఇదే మన సంకల్పమని, అలాగే రాష్ట్రంలో కూడా ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, కాంగ్రెస్ పార్టీ 9 గ్యారంటీలను విడుదల చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు దాసరి చింతలయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతల మోహన్ రావు, రాష్ట్ర అధికార ప్రతినిధి ఊకొట్టు వాసు, జిల్లా ఉపాధ్యక్షులు జనార్దన్ , హుస్సేన్ బాషా, రహ్మాన్, రియాజ్ బాష, అహ్మద్ హుస్సేన్ , బజ్జర రవి , సంజీవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక మంత్రి బుగ్గనకు బిగ్ షాక్

విశాలాంధ్ర – డోన్ రూరల్: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి డోన్ నియోజకవర్గంలో అనుకోని ఎదురు దెబ్బ తగిలింది. పట్టణంలో వైసీపీ అధికారంలో ఉన్నా, లేకున్నా మొదటినుంచి ఆర్థిక మంత్రికి కుడి భుజంగా ఉండి అన్ని రకాలుగా వైసీపీకి పార్టీకి చేదోడు వాదోడుగా ఉంటూ వచ్చిన మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికె హరికిషన్ కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి, సుజాతమ్మ సమక్షంలో టీడీపీ కండువా కప్పుకోవడానికి తన అనుచర గణంతో ఈనెల నాలుగవ తేదీన రంగం సిద్ధం చేసుకున్నారు.

అడుగడుగునా అవమానాలు భరించలేకే: వైసీపీ అధికారంలో లేక ముందు నుండి పార్టీని అంటి పెట్టుకుని ఎన్నో కష్టనష్టాలను, కేసులను ఎదుర్కొని పార్టీకి అండగా నిలబడితే అధికారంలోకి వచ్చాక సముచిత స్థానం కల్పిస్తామన్న ఆర్థిక మంత్రి బుగ్గన మాటలు నీటి మీద రాతలే అయ్యాయని కోట్రికే హరి కిషన్ వర్గీయులు అగ్గి మీద గుగ్గిలం అవుతున్నారు. తమ నాయకునికి మున్సిపల్ చైర్మన్ పదవి ఇస్తామని భరోసా ఇచ్చి మొండి చేయి చూపడం, పార్టీలో ఎటువంటి ప్రజాదరణ లేని వారికి అగ్రస్థానం ఇవ్వడం, ప్రస్తుత నూతన కట్టడాలకు పేర్లు మార్చడం వంటి విధానాల పట్ల కోట్రికె హరికిషన్ పార్టీ కార్యక్ర మాలకు అంటి ముట్ట నట్లు వ్యవహరిస్తూ వచ్చారు. అందుకు తగ్గట్టుగానే బుగ్గన, ఆయన వర్గీయులు కూడా హరికిషన్‌ను పట్టించుకున్న పాపాన పోలేదు. ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అటు వైశ్య సామాజిక వర్గంలో మంచి పట్టుండి, పట్టణంలో ఎవరికి ఏ సమస్య వచ్చి పిలిచినా పలికే ముఖ్య నాయకుణ్ణి పోగొట్టుకోవడం వైసీపీ పార్టీకి భారీ నష్టమని హరి అనుయాయులు పలువురి అభిప్రాయం.

ఫలించని బుజ్జగింపులు: అధికార పార్టీని వదులుతున్న వైస్ చైర్మన్ హరి కిషన్ టీడీపీ లోకి మారుతుండడంతో బుజ్జగింపుల పర్వం మొదలైంది. పలువురు వైసీపీకి చెందిన చోటమోట నాయకులు హరికిషన్ ఇంటికి వెళ్లి, మరి కొంతమంది ఆయన బంధువులకు ఫోన్లు చేసి పార్టీ మారొద్దని బుజ్జగింపులు మొదలుపెట్టారు. ఎవరు ఎంత చెప్పినా వైసీపీ అధికారంలో లేనప్పటినుండి పార్టీ జెండా మోసిన కార్యకర్తలకు అధికార పార్టీలో తీవ్ర అన్యాయం జరిగిందని, అందుకే పార్టీ మారుతున్నట్టు హరికిషన్ వర్గీయులు తెలిపారు.

వైసీపీ ఇంటింటి ప్రచారం

విశాలాంధ్ర – చాగలమర్రి : వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గంగుల బిజేంద్రారెడ్డి ని గెలిపించాలని ఆయన సోదరి గంగుల అవంతికారెడ్డి కోరారు. బుధవారం మండలంలోని డి. వనిపెంట, కొత్తపల్లె గ్రామాలలో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తన సోదరున్ని అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలీశ్వరరెడ్డి, ఎంపీపీ రామిశెట్టి వీరభద్రుడు, వైసిపి మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి రమణ, జిల్లా సేవాదల్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, వైసిపి నాయకులు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రవి, తోడేండ్లపల్లె సర్పంచ్ గోవిందయ్య, సుబ్బయ్య, శ్రీధర్, వీరయ్య, చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిరప పంటకు నిప్పు

విశాలాంధ్ర–అవుకు: మండలంలోని మెట్టుపల్లి గ్రామానికి చెందిన దూదేకుల దస్తగిరి అనే రైతుకు చెందిన ఎండుమిరప పంటకు రాత్రి గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టిన ఘటన చోటుచేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం మూడు ఎకరాల్లో మిరప పంట సాగు చేశానని, పంట చేతికి రాగా కూలీల ద్వారా మిరపను సేకరించి గ్రామ సమీపంలోని కళ్ళంలో ఎండబెట్టారు. మార్కెట్‌కు విక్రయించేందుకు సిద్ధంగా ఉంచి, ఎండబెట్టిన మిరప పంటకు గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి నిప్పు పెట్టారు. తమపై గిట్టని వారే ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని బాధిత రైతు వాపోయారు. అగ్నికి కాలీ బూడిదైన మిరపకాయల నష్టం దాదాపు 1,00,000 నష్టం వాటిలినట్లు బాధిత రైతు తెలిపారు.

ఈ నెల 9 నుంచి నందవరం శ్రీ చౌడేశ్వరి ఉత్సవాలు

విశాలాంధ్ర – బనగానపల్లె: నంద్యాల జిల్లా బనగానపల్లె మండలం నందవరం శ్రీ చౌడేశ్వరి దేవి దేవస్థానంలో ఈ నెల 9నుంచి 15 వరకు క్రోధి నామ ఉగాది జ్యోతి మహెూత్సవాలు జయప్రదంగా నిర్వహించుటకు సన్నాహాలు పూర్త య్యాయని ఆలయ సహాయ కార్యదర్శి, ముఖ్య కార్యనిర్వహణాధికారి జి. కామేశ్వరమ్మ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ అన్ని శాఖలతో సమన్వయంగా కలిసి పని చేసి నందవరం చౌడేశ్వరి అమ్మవారి జ్యోతి మహెూత్సవాలు జయప్రదం చేస్తామన్నారు.

9 నుంచి 15 వరకు జ్యోతి ఉత్సవాలు: భక్తుల కోరికలు తీర్చే మహిమాన్వితురాలిగా ఖ్యాతి పొందిన నందవరం చౌడేశ్వరి దేవి జ్యోతి ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఎన్నికల కోడ్ కారణంగా ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో కాకుండా కేవలం ఆలయ అధికారులు నేతృత్వంలో ఏడు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. తొగట వీర క్షత్రియుల జ్యోతుల ప్రదర్శన కార్యక్రమం ఉత్సవాలకే ప్రత్యేకం. ఉత్సవాల్లో భాగంగా 9న ఉదయం అంకురార్పణ పూజలు, సాయంత్రం పన్నేరపు బండ్లు తిప్పు కార్య క్రమం ఉంటుంది. 10న శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి కల్యాణో త్సవం, గ్రామోత్సవం, 11న సాయంత్రం అమ్మవారి రాయభార మహెూత్సవం, 12 న రాత్రి 12 గంటలకు అమ్మవారికి దిష్టి చుక్క పెట్టుట, అనంతరం జ్యోతి మహెూత్సవం, 13న సాయంత్రం అమ్మవారి రథోత్సవం పోవడం, 14న రథోత్సవం రావడం, 15న వసంతోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి.

మౌలిక సదుపాయాలు కల్పించాలి : సీపీఐ

విశాలాంధ్ర– నందికొట్కూరు : రాష్ట్రవ్యాప్తంగా సామాజిక పెన్షన్ లబ్ధిదారులకు ఫించన్ పంపిణీ పై ఎలాంటి సమాచారం లేకపోవడం వల్ల లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారని పెన్షన్ల పంపిణీపై లబ్ధిదారులకు సమాచారం ఇవ్వటానికి ప్రభుత్వం గ్రామ మరియు పట్టణాల యందు మైక్ ద్వారా సమాచారం ఇవ్వాలని సీపీఐ జిల్లా నాయకులు రఘురామమూర్తి ,సీపీఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. బుధవారం నందికొట్కూరు పట్టణ మున్సిపల్ కమిషనర్ సుధాకర్ రెడ్డికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఎండ తీవ్రత వల్ల వడ దెబ్బలకు గురికాకుండా సామాజిక పెన్షన్ దారులకు సచివాలయాల దగ్గర మౌలిక వసతులు త్రాగునీరు, టెంట్ హౌస్ ,కుర్చీలు మెడికల్ కిట్ లు ఉంచాలని వృద్ధులకు మరియు వికలాంగులకు ఇంటి దగ్గరనే ఫించన్ పంపిణీ చేయాలన్నారు. ఈ విషయంపై సానుకూలంగా స్పందించిన మున్సిపల్ కమిషనర్ సుధాకర్ రెడ్డి నేటి నుంచే సచివాలయాల దగ్గర టెంట్లు, త్రాగునీటి సౌకర్యం ఇతరత్ర కల్పిస్తామని ఆయన హామీ ఇవ్వడం జరిగిందన్నారు.

శ్రీశైలానికి పోటెత్తిన కన్నడ భక్తులు

విశాలాంధ్ర – శ్రీశైలం: శ్రీశైలం మహా క్షేత్రంలో ఉగాది మహెూత్సవాలను ఎంతో వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి డి పెద్ది రాజు తెలిపాడు. ఆరవ తేదీ నుండి పదవ తేదీ వరకు జరిగే ఉగాది మహెూత్సవాలకు కనడ మహారాష్ట్ర భక్తులు అధిక సంఖ్యలో శ్రీశైలం చేరుకుంటున్నారు కొంతమంది భక్తులు వాహనాల్లో వస్తుంటే పాద యాత్రగా అధిక సంఖ్యలో భక్తులు శ్రీశైలం చేరుకొని తమ తమ మొక్కులు తీర్చుకుంటున్నారు దేవస్థానం తరపున ఉగాది మహెూత్సవాలకు చేసినటువంటి ఏర్పాట్లను కైలాస ద్వారా వద్ద కార్యనిర్వహణ అధికారి రెడ్డి పెద్దిరాజు ఆలయ ఇంజనీరింగ్ విభాగం అధి కారులతో కలిసి పరిశీలించారు కాలినడకన శ్రీశైలం చేరుకునే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఉండేలాగా అటవీ శాఖ వైద్యశాఖ అధికారుల సమన్వయంతో పనిచేయాలని ఉగాది మహెూత్సవాలకు కనడ భక్తులు అధిక సంఖ్యలో పాద యాత్రగా శ్రీశైలం చేరుకుంటారు కాబట్టి పాదయాత్ర భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా మంచినీరు వైద్య సదుపాయాలు ఆయా ప్రదేశాల్లో భక్తులు విశ్రాంతి తిరిగేందుకు చలవ పందిళ్ళు అన్న ప్రసాద వితరణ చేస్తున్న భక్తులకు దేవస్థానం తరపున కావాల్సిన అన్ని సదుపాయాలు భక్తుల రద్దీకి అనుకూలంగా క్యూ లైన్‌లో ఏర్పాట్లు భక్తులకు కావాల్సినన్ని లడ్డు ప్రసాదాలు పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేయడం జరిగిందని శ్రీశైలం వచ్చిన భక్తులకు ఉగాది మహెూత్సవాల దృష్టి ఎటువంటి ఇబ్బందులు కలక్కుండా అన్ని చర్యలు తీసుకున్నట్టు ఆలయ కార్యనిర్వహణ అధికారి పెద్దిరాజు తెలిపాడుతెలిపాడు

Change of Name

I NAIK JAKEER S/o NAIK ALISHAIR, H. No. 17-144-13B -2E-1, upstair, Jagajjanani Nagar, Nandyal - 518501, Nandyal Dist. A. P. hereby state that I have changed my name NAIK JAKEER (old name) TO SHAIK JAKEER (new name) and known as SHAIK JAKEER

విద్యార్థుల నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే ఐఎన్‌టీఎస్పీ

విశాలాంధ్ర - ఆదోని రూరల్ : ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్ కాంపిటీషన్ పోటీలలో విద్యార్థుల నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే నిర్వహించడం జరుగుతుందని ప్రిన్సిపల్ గౌసియ ఖానమ్ తెలిపారు. బుధవారం శ్రీ చైతన్య-1 పాఠశాలలో నిర్వహించిన పోటీలలో విద్యార్థులు నైపుణ్యాన్ని చాటుకొని గెలుపొందడంతో ఆమె చేతుల మీదుగా బహుమతులను అందుకున్నారు. గెలుపొందిన విద్యార్థులను అభినందిస్తూ మొదటి బహుమతి ఐదవ తరగతి విద్యార్థి వరలి వర్య ట్యాబ్ కైవసం చేసుకుంది. రెండవ బహుమతి ఈక్షిత్, మూడవ బహుమతి సాయి వైష్ణవి,నాలుగవ బహుమతి అక్షోభ్య సంజీవ్, ఐదవ బహుమతికి నలుగురు విద్యార్థులు,స్పెషల్ బహుమతికి నలుగురు విద్యార్థులు,కన్సోలేషన్ బహుమతులు 29,గోల్డ్ మెడల్స్ 36,మెరిట్ సర్టిఫికెట్స్ 233 మంది విద్యార్థులు కైవసం చేసుకున్నట్లు తెలిపారు. ఇటువంటి బహుమతులను విద్యార్థులు మరెన్నో కైవసం చేసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏటీఎం సురేష్, ఆర్ఐ రంగారెడ్డి,అకాడమిక్ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, ఏవో అశోక్,అకాడమిక్ డీన్ వీరారెడ్డి,ఒలంపియాడ్ ఇన్చార్జిలో అశోక్,అన్నపూర్ణ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఈడీ పరీక్ష

ఫలితాలు విడుదల

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యు కేషన్ : రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో ఉన్న బీఈడీ పరీక్ష ఫలితాలు బుధవారం విడుదల చేశారు. రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ బి.సుధీర్ ప్రేమ్ కుమార్ బీఈడీ ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 బీఈడీ పరీక్ష ఫలితాల్లో విద్యార్థి, విద్యార్థులు 2964గాను 770 పరీక్షల్లో పూర్తీర్ణత సాధించారని తెలిపారు.

సుగుణమ్మ మృతి సీపీఐ, మహిళా సమాఖ్యకు తీరనిలోటు : బి.గిడ్డయ్య

విశాలాంధ్ర - కర్నూలు : సీపీఐ నంద్యాల జిల్లా కార్యవర్గ సభ్యురాలు, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలుగా పని చేస్తున్న కామ్రేడ్ సుగుణమ్మ అనారోగ్య రీత్యా మృతిచెందడం పార్టీకి ప్రజా సంఘాలకు, మహిళా ఉద్యమానికి తీరని లోటని సీపీఐ కర్నూలు జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య ఒక ప్రకటనలో సీపీఐ జిల్లా సమితి తరఫున ఆయన ప్రగాఢ సంతాపాన్ని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కామ్రేడ్ సుగుణమ్మ ఉమ్మడి కర్నూలు జిల్లాలో జరిగిన పార్టీ ,ప్రజా సంఘాలు నిర్వహించిన అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారని, ఉమ్మడి జిల్లా అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శిగా పని చేశారనీ, ఎంతో పట్టుదలతో అంకితభావంతో పేద ప్రజలు కార్మికుల కోసం పనిచేసిన సుగుణమ్మ మృతి తీరని లోటని,ఆమె మృతికి ఆయన తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

ఏఐటీయూసీ రాష్ట్రసమితి సంతాపం : అంగన్‌వాడీ ఉద్యమంలో చురుకైన పాత్ర నిర్వహిస్తూ నిరంతరం కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతూ అసువులు బాసిన సుగుణమ్మ మృతి ఏఐటీయూసీ ఉద్యమానికి. అంగన్‌వాడీ ఉద్యమానికి తీరని లోటు ఆమె మృతికి ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

సుగుణమ్మ మృతి మహిళా ఉద్యమానికి తీరనిలోటు : మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు, అంగన్‌వాడీ యూనియన్ నేత సుగుణమ్మ మృతి పార్టీకి తీరనిలోటని, ఆమె మృతికి సంతాపం తెలియచేస్తూ, వారి కుటుంబానికి తమ సానుభూతిని తెలియచేస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, ఏపీ చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్రప్రధాన కార్యదర్శి కె రామాంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నంద్యాల జిల్లా కార్యదర్శి కామ్రేడ్ ఆర్ సుగుణమ్మ మృత దేహానికి సిపిఐ కర్నూల్ కార్యదర్శి పి రామకృష్ణారెడ్డి, సీఆర్ సేవా సమితి కమిటీ నెంబర్ శివప్రసాద్ ఏఐటియుసి నంద్యాల జిల్లా సెక్రెటరీ సుంకయ్య సీపీఐ మండల కార్యదర్శి పులి శేఖర్ తదితరులు పూల మాలవేసి నివాళులర్పించడం జరిగినది

ఉపాధి కూలీలకు కనీస వేతనం రూ.300 పెంచాలి

విశాలాంధ్ర - మంత్రాలయం : ఉపాధి కూలీలకు కనీస వేతనం రూ.300 పెంచాలని సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం ఎంపీడీవోకు వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి భాస్కర్ యాదవ్ మాట్లాడుతూ మంత్రాలయం మండల పరిధిలో ఆయా గ్రామాల్లో ఉపాధి పని నియమించారే కానీ కనీస వేతనం లేక తీవ్ర ఇబ్బంది పడుతూ ఉపాధి పనులు చేస్తున్నారన్నారు. ఎండ 45 డిగ్రీస్ ఉంటే ఎండను సైతం లెక్కచేయకుండా పొట్ట కోసం ఉపాధి పనులు చేస్తున్న వారికి ప్రభుత్వం మజ్జిగ చల్లని నీరు సఫర్ చేయాలన్నారు. కనీసం రూ.300 పెంచాలని డిమాండ్ చేశారు. వెంటనే ప్రభుత్వం స్పందించే ఎండాకాలంలో మజ్జిగ, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. కోసిగి సిపిఐ మండల

కార్యదర్శి గోపాల్, గాబ్రెల్, ఎస్ రాజు, బండప్ప, నీలకంటప్ప పాల్గొన్నారు.

ప్రేమ జంట ఆత్మహత్యాయత్నం

విశాలాంధ్ర-పత్తికొండ: మండలంలోని పులికొండ గ్రామంలో ప్రేమజంట ఆత్మహత్యాయత్నం చేసుకోవడం జరిగింది. గ్రామానికి చెందిన రాజశేఖర్ తమ సమీప బంధువు అమ్మాయి ఒకరినొకరు మూడు సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారు. వీరి పెళ్లికి పెద్దలు అంగీకరించకపోవడంతో, సోమవారం ఇంటి నుండి బయటకు వెళ్ళిపోయి గ్రామ శివారులోని ఓ పొలంలో అపస్మారక స్థితిలో పడి ఉన్న జంటను చూసి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకొని ప్రేమ జంటను చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

జాతీయస్థాయి సీనియర్ క్యారమ్స్ పోటీలకు లిఖిత రెడ్డి

విశాలాంధ్ర - కర్నూలు : ఈ నెల 6 నుంచి 10 వ తేదీ వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్లో జరగబోయే 51వ జాతీయ సీనియర్ క్యారమ్స్ పోటీలకు కర్నూలు జిల్లాకు చెందిన క్రీడాకారిణి వి.లిఖితా రెడ్డి ఎంపికైనట్లు జిల్లా క్యారమ్స్ సంఘం ప్రధాన కార్యదర్శి చెన్నా కేశవరాజు తెలిపారు. ఇటీవల గుంటూరులో జరిగిన రాష్ట్రజట్టు ఎంపిక పోటీల్లో అత్యుత్తమ క్రీడా నైపుణ్యాలు ప్రదర్శించి జాతీయ పోటీలకు ప్రాతినిధ్యంవహించే రాష్ట్ర జట్టులో చోటు దక్కించుకున్నారు. లికిత రెడ్డి ఇప్పటికి ఏడుసార్లు జాతీయస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించింది.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్డీవో

విశాలాంధ్ర - తుగ్గలి: రాష్ట్రంలో త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు దృష్టిలో పెట్టుకొని మండలంలోని పోలింగ్ కేంద్రాలను పత్తికొండ ఆర్డిఓ రామలక్ష్మి బుధవారం పరిశీలించారు. తుగ్గలి మండల పరిధిలోని ముక్కెళ్ల,మారెళ్ల, బొందిమడుగుల, రాంకొండ, రాంపల్లి, ఎద్దులదొడ్డి, తదితర గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు.అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అవసరమయిన సౌకర్యాలను ఏర్పాటు చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు.పోలింగ్ బూత్ లలో ప్రతి ఓటరు ఓటు హక్కును వినియోగించుకొని విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులకు తెలియజేశారు.ఆర్డిఓ గ్రామాలలోని ప్రజలతో మాట్లాడుతూ ఎన్నికల ప్రశాంతంగా జరగడానికి అధికారులకు సహకరించాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తుగ్గలి తహసిల్దార్ షర్మిల,ఆర్.ఐ సుధాకర్ రెడ్డి, వీఆర్వోలు, రెహమాన్,కాసి రంగస్వామి, వెంకట్రాముడు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

ఆదరించండి, అభివృద్ధి చేస్తా : రాఘవేందర్ రెడ్డి

విశాలాంధ్ర - కౌతాళం : రాబోయే ఎన్నికలలో టీడీపీని ఆదరించి విజయానికి కారుకుల అవ్వాలని మంత్రాలయం టీడీపీ అభ్యర్థి రాఘవేందర్ రెడ్డి అన్నారు. బుధవారం ఉదయం మండల కేంద్రమైన కౌతాళంలో హనుమాన్ నగర్, పింజారి గిరి, మాసలగిరి ,మారెమ్మ వీధి, తలారి గిరి, బిఎస్ఎన్ఎల్ వీధి తదితర కాలనీలో ఇంటింటికి వెళ్ళుతూ ప్రజలతో మాటలు కలుపుతూ, ముచ్చటిస్తూ ప్రచారం ప్రారంభించారు. సందర్భంగా రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ బడుగు బలహీన వర్గాల పార్టీ అని అధికంగా వెనుకబడిన వారికే సీట్లు కేటాయించడం జరిగిందన్నారు. ప్రజల కష్టాలు, నష్టాలు తెలిసిన అభ్యర్థులు గెలుపుతో తమ కష్టానష్టాలలో పాలుపంచుకొని అభివృద్ధికి బాటలు వేస్తారని పేర్కొన్నారు. 50 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి నాలుగు వేల పింఛను, పాఠశాల చదువుతున్న ప్రతి విద్యార్థికి 15000 వేల రూపాయలు, అన్నదాతకు సంవత్సరానికి 20000, తదితర పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు ఉలిగయ్య, తెలుగు యువ నాయకులు సురేష్, సతీష్ నాయుడు, కురువ వీరేష్, జనసేన మండల అధ్యక్షులు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మట్టి ఖర్చులకు ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - ఆదోని రూరల్ : మండలంలోని పెద్ద తుంబలం గ్రామంలో బోయ బెల్గాల్ ఉషెనమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో విషయం తెలుసుకున్న కాంట్రాక్టర్ బసవరాజు ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి సహకారంతో రూ.5000 మట్టి ఖర్చులకు ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. బుధవారం జంగల్ వీధిలో ఇంటి వద్దకు చేరుకుని మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బోయ బెల్గాల్ హుస్సేనమ్మ కుటుంబానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళల అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సర్పరాజు, అలీమౌల,విభూతి కుమార్,మోతే బంగారప్ప తదితరులున్నారు.

హొన్నూరులో దాహం.. దాహం..

- తాగునీటి కోసం బోరు బావులను ఆశ్రయిస్తున్న ప్రజలు
- నీటి సమస్యను పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర-హొళగుంద: రాష్ట్ర సరిహద్దు గ్రామ పంచాయతీ కేంద్రమైన హొన్నూరులో తాగునీటి సమస్యతో ప్రజలు అల్లాడిపోతున్నారు. తాగునీరు దొరక్క గ్రామంలో దాహం అంటూ అర్థనాదాలు చేస్తున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు ఎవరు పట్టించు కోవడం లేదని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. హొన్నూరు కొట్టాల నుండి రోజు తాగునీటి సరఫరా అవుతుందని, గత 20 రోజుల నుండి నీటి సరఫరాకాక నానావస్తులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేదవతి నది నుండి పైప్లైన్ ద్వారా పంట పొలాలకు సరఫరా చేసే నీటిని కిలోమీటర్ దూరం వరకు నడిచి వెళ్లి తాగేందుకు నీటిని అతికష్టం మీద తెచ్చుకుంటున్నట్లు అసహనం

వ్యక్తం చేస్తున్నారు. గ్రామ నడిబొడ్డులో ఉన్న మంచినీటి ట్యాంకులో నీరులేక పూర్తిగా ఎండిపోయిందని, కొళాయిలకు నీరురాక రోజు నీటి కోసం ఎదురుచూస్తున్నామని మహిళలు ఆరోపిస్తున్నారు. మంచినీటిని బోరు బావులు, వేదావతి నదికి వెళ్లి నీటిని తీసుకు వస్తున్నామని వేసవి ఎండలు తీవ్రంగా ఉన్నాయని, తమతో పాటు పశుపక్షులకు తాగునీటి ఇబ్బంది ఏర్పడిందని ప్రజలు స్పష్టం చేశారు. హెచ్.కొట్టాల నుండి నీటి సరఫరా జరిగితే కొందరు విద్యుత్ మోటర్లు వాడడం వల్ల గ్రామంలో కొళాయిలకు నీరు సరఫరా కావడం లేదని ప్రజలు ఆరోపించారు. ఎండలను లెక్క చేయకుండా తోపుడుబండ్ల సహాయంతో యువకులు బోరు బావి, పొలాలకు పైపుల ద్వారా మళ్లించే నీటిని బిందెల్లో ఎత్తుకోవచ్చారు. హెచ్ కొట్టాల నుండి తాగు నీరు ఎప్పుడు సరఫరా అవుతుందో.. లేదో తెలియడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఫ్లోరైడ్ నీటిని తాగడం వల్ల మోకాళ్ళ నొప్పులు వస్తున్నాయని, రూ.20 కోట్లు వెచ్చించి తాగునీటి పైప్లైన్ ఏర్పాటు చేసి ఏళ్ళు గడుస్తున్నా ఎల్ఎల్సీ నుంచి శుద్ధమైన నీరు కరువయ్యాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎల్ఎల్సి నీటి ఆశను వదులుకున్నామని, బోరు నీరే తాగుతున్నామని అన్నారు. సంబంధిత అధికారులు నిర్లక్ష్యాన్నివీడి గ్రామానికి శుద్ధికరించిన తాగునీటిని సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రేపు ఎన్నికల సన్నాహక సమావేశం : బి.గిడ్డయ్య

విశాలాంధ్ర-పత్తికొండ: ఈ నెల 5న ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య తెలిపారు. గురువారం శుక్రవారం స్థానిక చదువుల రామయ్య భవనంలో ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలకు చాలా ప్రాధాన్యత ఉందని, సీపీఐ(ఎం), కాంగ్రెస్, ఇండియా కూటమి బలపరుస్తున్న పత్తి కొండ నియోజకవర్గం సిపిఐ అభ్యర్థిగా పి.రామచంద్రయ్య ఎన్నికల బరిలో నిలుస్తున్నారని తెలిపారు. మతోన్మాద మోడీతో దేశానికి పెను ప్రమాదం ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో అధికార వైసీపీ, టీడీపీ, బీజేపీతో ప్రత్యక్షంగా, పరోక్షంగా అంటకాగుతున్నాయని విమర్శించారు. కేంద్రంలో మోడీ ఎన్నికల

ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను ఏమాత్రం నెరవేర్చకుండా, ప్రజలను మరోసారి మోసం చేసేందుకు మోసపూరితపు హామీలతో ఎన్నికలకు వస్తున్నారని, మతోన్మాద బీజేపీని ఇంటికి సాగనంపాలన్నారు. రాష్ట్రంలో 2014-2019 వరకు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నారని, 2019-2024 వరకు జగన్మోహన్ రెడ్డి ముఖ్య మంత్రిగా ఉంటూ రాష్ట్ర అభివృద్ధికి ఏమాత్రం కృషి చేసింది లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతరం ప్రజా పోరాటాలు చేస్తున్న సీపీఐ అభ్యర్థి పి.రామచంద్రయ్యను గెలిపించుకు నేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 5న పత్తికొండలో తలపెట్టిన ఎన్నికల సన్నా హక సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామ కృష్ణ, సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బాబురావు, ఇండియా కూటమి పార్లమెంట్ అభ్యర్థి రాం పుల్లయ్య యాదవ్ =లు హాజరవుతారని, నియోజకవర్గంలోని సీపీఐ, సీపీఐ(ఎం) కాంగ్రెస్ పార్టీలు, ప్రజా సంఘాలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి డి.రాజా సాహెబ్, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా సమితి సభ్యులు కారన్న, కృష్ణయ్య, మండల సహాయ కార్యదర్శి రంగన్న పాల్గొన్నారు.

కలసి రండి.. అబద్దాల ముఖ్యమంత్రిని గద్దె దించుదాం : కేఈ శ్యాం బాబు

విశాలాంధ్ర - క్రిష్ణగిరి : అబద్దాల ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని గద్దె దించేందుకు అందరూ కలిసి రావాలని పత్తికొండ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ. శ్యాంబాబు అన్నారు. బుధవారం మండల పరిధిలోని స్తోత్రం ఎర్రగుడి మన్నెగుంట గ్రామాలలో బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శ్యాం బాబు ప్రతి ఇంటికి వెళ్లి చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ఈ సందర్భంగా ఆయన ప్రజలకు తెలియజేస్తూ ప్రతి ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితం, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, వృద్ధాప్య పెన్షన్లు 4 వేలు, ఇంటిలో చదువుతున్న ప్రతి విద్యార్థికి రూ.15 వేలు, ప్రతి నెల మహిళలకు రూ.1500, యువతకు రూ.20 లక్షల ఉద్యోగాలు లేదా నిరుద్యోగ భృతి రూ.3 వేలు, రైతు భరోసా కింద ఏడాదికి రూ.20 వేలు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. మే 13న జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై అమూల్యమైన ఓటు వేసి టిడిపిని గెలిపించాలని ఆయన కోరారు. వైసీపీ అధికారంలోకి వస్తే రాజన్న రాజ్యం తెస్తానని రాక్షస రాజ్యం తెచ్చారని ఆయన విమర్శించారు. వైసిపి పాలనలో ప్రజలకు రైతులకు సంతోషం లేదు రాష్ట్రాన్ని నట్టేట ముంచేసి మరో అవకాశం ఇవ్వాలని సిద్ధం సభల్లో ఓటర్లను వెర్రి వాళ్ళను చేస్తున్నారని ఆయన ఎద్దేవ చేశారు. ఎవరు అధైర్య పడకండి వచ్చేది చంద్రబాబు పాలన అందరికీ న్యాయం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి నవి

సాహెబ్, మండల అధ్యక్షులు శ్రీరాములు న్యాయవాది ఎల్వీ ప్రసాద్, రఫీ సాహెబ్ ,మాజీ సర్పంచ్ సురేంద్ర నాథ్ రెడ్డి, నక్క నాగరాజు, వీరభద్రుడు, దామోదర్ నాయుడు, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, చాకలి సుంకన్న సుదర్శనం టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీఐ ఆదినారాయణరెడ్డిని సస్పెండ్ చేయాలి :టీజీ భరత్

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : తమ పార్టీ నేతలను కొట్టిన సీఐ ఆదినారాయణ రెడ్డి, ఇందులో భాగమైన కానిస్టేబుళ్లు మురళి, సాదిక్‌లపై వెంటనే చర్యలు తీసుకోవాలని కర్నూలు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి టి.జి భరత్ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, జనసేన అసెంబ్లీ ఇంచార్జి అర్షద్, బాధితులతో కలిసి జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ నుండి ఫోన్ చేసి పీస్ మీటింగ్‌కు రావాలంటూ 8వ వార్డు టీడీపీ కార్పోరేటర్ పరమేష్‌తో పాటు సీనియర్ నాయకులు శేషగిరిశెట్టి, శ్రీకాంత్‌లను పిలిపించారన్నారు. అక్కడి నుండి జగన్నాథగట్టుపై ఉన్న డి.టి.సికి తీసుకెళ్లి బూతులు మాట్లాడుతూ ఇష్టానుసారంగా కొట్టారని

టి.జి భరత్ తెలిపారు. వీరిపై ఎలాంటి కేసులు లేవన్నారు. టీడీపీ ప్రజల్లో మద్దతు పెరుగుతుందన్న ఉద్దేశంతోనే కావాలని టార్గెట్ చేసి వీరిని కొట్టారని చెప్పారు. ఏ తప్పు చెయ్యని వాళ్లను కొట్టాలని రాజ్యాంగంలో రాసి ఉందా అని టి.జి భరత్ ప్రశ్నించారు. ఇందుకు కారణమైన సీఐ ఆది నారాయణ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీకి ఫిర్యాదుచేసినట్లు తెలిపారు. వీరిపై సస్పెన్షన్ వేటు వేయాలని కోరామన్నారు. ఈ విషయంలో తమకు న్యాయం జరగని పక్షంలో ఎలక్షన్ కమిషన్‌తోపాటు హైకోర్టును ఆశ్రయిస్తామని టి.జి భరత్ పేర్కొన్నారు. విచారించి ఏం చేయాలన్న దానిపై ముందుకు వెళతామని ఎస్పీ చెప్పారన్నారు. కాగా వైసీపీ నేతల ప్రోత్సాహంతో ఈ దాడులకు పాల్పడినట్లు స్పష్టంగా తమకు అర్థమవుతోందన్నారు. టీజీ కుటుంబం ప్రజా సేవ చేస్తూ ఎవ్వరికీ హాని తలపెట్టుకుండా రాజకీయాల్లో కొనసాగుతోందన్నారు. తన కార్య కర్తలపై పడిన దెబ్బలను తనమీద పడినట్లు బావి స్తానని టి.జి భరత్ చెప్పారని అర్షద్ పేర్కొన్నారు. అనంతరం కార్పోరేటర్ పరమేష్, శేషగిరిశెట్టి మాట్లా దుతూ తమపై ఎలాంటి కేసులు లేవని బ్రతిమాలినా వినకుండా కొట్టారని చెప్పారు. ప్రజాప్రతినిధులమైన తమనే కొడితే ఇక ప్రజలను ఎవరు కాపాడ తారన్నారు. టిడిపిలో చురుకుగా పనిచేస్తున్నందుకే తమను టార్గెట్ చేసి కొట్టారన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామల పర్వం

విశాలాంధ్ర - తుగ్గలి: రాష్ట్రంలో కొనసాగుతున్న వాలెంటర్‌ల రాజీనామాలు బుధవారం మద్దికేర మండల పరిధిలోని పెరవలి గ్రామంలో 34 మంది వాలంటీర్లు స్వచ్ఛందంగా తమ రాజీనామాను ఉన్నత అధికారులకు అందజేశారు.ఈ సందర్భంగా వాలంటీర్లు మాట్లాడుతూ మేము ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజాసేవ చేయడానికి ముందుకు వచ్చామే తప్ప మరొకటి కాదన్నారు. వృద్ధులకు ,వికలాంగులకు పెన్షన్ దారులకు మమ్మల్ని పెన్షన్ పంచకుండా దూరం చేయడంతో తీవ్ర మనస్థాపానికి లోనై ఈ రాజీనామా చేయవలసి వచ్చిందన్నారు.వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కులం మతం చూడకుండా ఏ పార్టీ అనే భేదం లేకుండా ప్రతి లబ్దిదారులకు సేవ చేశామని అయితే మేము చేసే సేవకు కొంతమంది అడ్డు పడటమే కాక ఎన్నో అవరోధాలను ఎదుర్కొంటూ సేవ చేస్తూ ముందుకు వెళ్తున్నామన్నారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మా సేవలు కొన్ని పార్టీలకు నచ్చక వారికి చేతకాక ఇతరులతో ఎన్నికల కమిషనర్ కు ఫిర్యాదు చేయడంతో ఎన్నికల కమిషనర్ వారు మమ్మల్ని పెన్షన్ పంచకుండా దూరంగా ఉంచడం జరిగిందన్నారు.ప్రజాసేవకే

అంకితమైన జీవితాలు నేడు ఇంట్లో కూర్చోవాలంటే మేము కూర్చోలేకపోతున్నామని అందుకే స్వచ్ఛందంగా 34 మంది రాజీనామా చేయడం జరిగిందన్నారు.జరగబోవు ఎన్నికల్లో వైసీపీకి సైనికులలా పనిచేసి పార్టీని గెలిపించుకోవడానికి కృషి చేయడానికి మేము సిద్ధంగా ఉన్నామన్నారు.

హనుమాపురంలో ఉపాధి పనులు

విశాలాంధ్ర - పెద్ద కడబూరు : మండల పరిధిలోని హనుమాపురం గ్రామ శివారుల్లో ఉపాధి హామీ పథకం కింద ఉపాధి కూలీలు ఫారమ్ ఫండ్స్ పనులను చేపట్టారు. వేసవి కాలం కావడంతో ఉపాధి కూలీలకు పనులు చేపట్టామని ఫీల్డ్ అసిస్టెంట్ చక్రి బుధవారం విలేకరులకు తెలిపారు. ప్రభుత్వ నిబం ధనల ప్రకారం కూలీలతో పనులు చేయిస్తున్నామని, ప్రభుత్వం నిర్ణయించిన వేతనం కూలీలకు అందేలా కొలతలను నిర్ణయించి చేయిస్తున్నామన్నారు. మేటీలు వీరేష్, గోవర్ధన్, వెంకటేశ్, రాఘవేంద్ర తదితరులు ఉన్నారు.

నియోజకవర్గం అభివృద్ధి కావాలంటే బుట్టను గెలిపించుకోవాలి

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు : నియోజకవర్గంలో అభివృద్ధి జరగాలంటే ఎమ్మెల్యే అభ్యర్థి బుట్ట రేణుకకు గెలుపు పించుకోవాలని, ఎంపీపీ నసీరుద్దీన్, మండల యూత్ అధ్యక్షులు టీకే బందేనావాజ్, మాజీ మండల కన్వీనర్ గోవిందు, కటికే మాబువలిలు అన్నారు. బుధవారం మండల కేంద్రమైన గోనెగండ్లలో స్థానిక వైసీపీ కార్యాలయంలో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుట్ట రేణుక ను గెలుపుపించుకుంటే ఎమ్మిగనూరు నియోజకవర్గంలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు బుట్ట రేణుక కృషి చేస్తారన్నారు. ప్రధానంగా ఎమ్మిగనూరు నియోజకవర్గంలో తాగు, సాగు నీరు సమస్య పరిష్కారం జరగాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి బుట్ట రేణుక గెలుపు పించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ 5 రోజులు వైసీపీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు, కష్టపడి, సైనికుడి లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు రఫీక్, పద్మనాభం, నదీముల్లా, గాజుల ఉస్మాన్, ముల్లా ఉసేన్, ముల్లా బడేసా, నాగలద్ది ముహమ్మద్, గౌస్ పాల్గొన్నారు.

బస్టాండ్‌లో మౌలిక వసతులు కల్పిస్తాం

విశాలాంధ్ర- కోసిగి: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని ఆదోని డిపో మేనేజర్ రఫీక్, ఎస్టిఐ రాఘవేంద్రలు అన్నారు. బుధవారం బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకుని, పరిసరాలను పరిశీలించారు. అక్కడ నెలకొన్న సమస్యలను ప్రయాణికులను, గ్రామస్తులకు అడిగి తెలుసుకున్నారు. సివిల్ వర్క్స్ విషయమై సివిల్ ఇంజనీర్‌తో మాట్లాడి, ఉన్నతాదికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. బస్టాండ్ ఆవరణలో ఇష్టానుసారంగా వాహనాలు ఆపిన, ప్రైవేటు వాహనాలు బస్టాండ్‌లో వచ్చి ప్రయాణికులకు ఇబ్బందులు పెడితే అటువంటి వారిపై గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం హేయమైన చర్య

విశాలాంధ్ర - క్రిష్ణగిరి : మండల పరిధిలోని స్తోత్రం ఎర్రగుడి గ్రామంలో రైతు భరోసా దగ్గర ఉన్న శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం ఏమైనా చర్య అని మండల అధ్యక్షులు డాక్టర్ వెంకటరామిరెడ్డి అన్నారు. బుధవారం విషయం తెలుసుకున్న ఆయన వైసీపీ కార్యకర్తలు గ్రామానికి వెళ్లి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం వారు పాత్రికేయులతో మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రం దగ్గర ఉన్న శిలాఫలకాన్ని రాత్రి కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడం మంచి పద్ధతి కాదని ఆయన తెలిపారు. ఎవరైనా గ్రామ అభివృద్ధికి పోటుపడాలి తప్ప ఇలాంటి విధ్వంసాలకు పాల్పడరాదని ఆయన అన్నారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటే గొడవలకు దారి తీసే పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం మనకే సిగ్గుచేటని ఆయన తెలిపారు. ఈ విషయాన్ని వెంటనే మండల అధికారులు స్పందించి విధ్వంసానికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ కార్యకర్తలు రాజశేఖర్ రెడ్డి ,ప్రహల్లాద ,జయరాంరెడ్డి, నక్కశాలు, సుంకన్న, మాదన్న తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

It is hereby informed that my client M. Mahammed Farooq, Son of M. Abdul Salam, resident of D. No. 1/677-6A, Raghavendra Colony of Adoni, has misplaced his Registered Original Link Document Dt. 18-11-2005, bearing Doc. No. 4676/2005 on 01-03-2024 while he went to Jamia Madjid for performing the prayer The said original Link Document was kept in a bag and the same was kept in the side bag of his Two Wheeler which he parked near the Mosque and the same is lost beyond recovery if anybody finds the said document, the same may kindly be handed over to me at the address given below.

V. SRIRAMULU,
ADVOCATE,
D. No. 4/343/451-A, TELECOM COLONY,
ADONI-518 302 Kurnool Dist.
Cell No. 9440244475.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, గురువారం 04, ఏప్రిల్ 2024

ముస్లింలకు ఇఫ్తార్ విందును ఇచ్చిన ఇంజేటి నాగిరెడ్డి

విశాలాంధ్ర –ఆళ్లగడ్డ : మున్సిపాలిటీ పరిధిలోని చింతకుంట మసీదులలో, ఆళ్లగడ్డ సద్దాం కాలనీ మసీదులో బుధవారం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద చింతకుంట గ్రామానికి చెందిన స్వర్గీయ ఇంజేటి కృష్ణారెడ్డి కుమారుడైన ఇంజేటి నాగిరెడ్డి ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న అనంతరం ముస్లిం సోదరులకు స్వయంగా వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరులు అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామన్నారు. మా నాన్న స్వర్గీయ ఇంజేటి కృష్ణారెడ్డి ఉన్నప్పటినుండి 10 సంవత్సరాలు ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును ఇచ్చారన్నారు. ఆయన తదనంతరం తాను కూడా ఆళ్లగడ్డ, చింతకుంట ముస్లిం సోదరులకు ఏదో ఒక రూపంలో సహాయ సహకారాలు అందించడం జరిగిందన్నారు. గత సంవత్సరం ముస్లింలకు స్థలము, వెయ్యి మంది ముస్లిం సోదరులకు రంజాన్ తోఫాను అందజేయడం జరిగిందన్నారు. ఈసారి కూడా వెయ్యి మంది ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇవ్వడం జరిగిందన్నారు. ముస్లిం సోదరులందరికీ ముందస్తు పవిత్ర రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఇంజేటి చంద్రమౌళీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇవ్వడం మాకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ముస్లిం సోదరులకు స్థల వితరణ రూపంలోనూ, ఏదో విధంగా తాము సహాయ సహకారాలు అందించామన్నారు. అల్లా దీవెనలు అందరికీ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం నాయకులు బికారి సాహెబ్ తో పాటు పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న ఫాం-6 దరఖాస్తులను క్లియర్ చేస్తున్నాం

విశాలాంధ్ర – నంద్యాల : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియకు సంబంధించి ఈ నెల 4న ఈవీఎంల మొదటి రాండమైజేషన్ నిర్వహిస్తామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు రాజకీయ పార్టీ ప్రతినిధులతో అన్నారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో ఎన్నికల నిర్వహణ, ఓట్ల లెక్కింపు కేంద్రాల నిర్ణయంపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ తరపున సయ్యద్ రియాజ్ బాష, టీడీపీ ప్రతినిదులు శివరామ్ రెడ్డి, వై వి రమణ, బిజెపి పార్టీ తరపున నాగ శివసాయి, వైసీపీ తరపున అనిల్ అమృత రాజు, సిపిఐ(ఎం) తరపున పూల నరసింహులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ పటిష్టంగా అమలు చేస్తున్నామన్నారు. పోలింగ్ ప్రక్రియకు సంబంధించి ఈ నెల 4వ తేదీన ఈవీఎంల మొదటి రాండమైజేషన్ నిర్వహిస్తామన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రాలకు సంబంధిచి ఆర్జీఎం ఇంజనీరింగ్ కాలేజీని గుర్తించామని రాజకీయ పార్టీ ప్రతినిధుల అభిప్రాయాల మేరకు సంబంధిత ప్రతిపాదనలను ఎన్నికల కమిషన్ కు సమర్పిస్తామన్నారు. హెూమ్ ఓటింగ్‌కు సంబంధించి పోలింగ్ కేంద్రానికి రాలేని, మంచానికే పరిమితమైన వారికి హెూమ్ ఓటింగ్ కల్పించడం జరుగుతోందని, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు హెూం ఓటింగ్‌పై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఓటర్ల జాబితాకు సంబంధించి ఫార్మ్-6 దరఖాస్తులు 1068, షిఫ్టింగ్ కు సంబంధించి ఏడు దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయని వీటిని వెంటనే క్లియర్ చేయాల్సిందిగా సంబంధిత రిటర్నింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. సీ-విజిల్ యాప్ ద్వారా వచ్చిన 101 ఫిర్యాదులను 100 నిమిషాలలోపు పరిష్కరించడం జరిగిందని తెలిపారు.

మంత్రాలయంలో టీడీపీ జెండా ఎగుర వేస్తాం

విశాలాంధ్ర – పెద్దకడబూరు : మంత్రాలయం పీఠంపై టీడీపీ జెండా ఎగుర వేస్తామని మంత్రాలయం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి సోదరుడు టీడీపీ యువనేత రామకృష్ణారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు బసలదొడ్డి ఈరన్న, బీసీ సాధికార రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లికార్జున, టీడీపీ నేతలు మీ సేవ ఆంజనేయులు, తలారి అంజీ, మహదేవ, గోనుమాను నరసన్న, డీలర్ నరసప్ప స్పష్టం చేశారు. బుధవారం మండల పరిధిలోని తారాపురం, రంగాపురం గ్రామాల్లో మంత్రాలయం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి తరుపున ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మీ బిడ్డ రాఘవేంద్రరెడ్డిని ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని, మీ సేవకుడిగా పని చేస్తారని తెలిపారు. మంత్రాలయం నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన బాలనాగిరెడ్డి సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యారని తెలిపారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీ పథకాలతో అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి.. ఆరుగురిపై కేసు నమోదు

విశాలాంధ్ర – కొలిమిగుండ్ల : మండలంలోని బెలుం గ్రామంలో వ్యక్తిపై దాడి చేసిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు సిఐ గోపీనాథ్ రెడ్డి బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన దూదేకుల బాష (పలుకూరు బాష) మంగళవారం రాత్రి తపాల్ హుసేని వీధిలో చేతి పంపు బోరుకు మరమ్మతులు చేయించి వస్తుండగా, అదే గ్రామానికి చెందిన తపాల్ హుస్సేన్, ఆమడాల శీను తో పాటు మరో నలుగురు మా వీధిలో వచ్చి మమ్మల్ని ఏదో తిట్టుకుంటూ వెళ్తావా అంటూ దూదేకుల భాషను అడ్డగించి రాయితో కొట్టడంతో రక్తం గాయం అయిందన్నారు. భాష ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరుగురుపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వైసీపీకి భారీ షాక్

విశాలాంధ్ర – బనగానపల్లె : బనగానపల్లె పట్టణ కరెంటు ఆఫీస్ ఏరియా మరియు బనగానపల్లె మండల యనకండ్ల గ్రామం నుంచి భారీగా టీడీపీలోకి చేరిన వైసీపీకి చెందిన వైసీపీ నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ సాదుల శివశంకర్ రెడ్డి, కంకర రామచంద్రారెడ్డి, వెంగల్ రెడ్డి, ఎర్ర పాపన్న గారి రాజు యాదవ్, పొట్టన్న గారి రాముడు యాదవ్, బెనకం జయన్న యాదవ్, సానం రాజు యాదవ్, బోయ శ్రీనివాసులు, వడ్డే భాను, వాలంటీర్ భూపాల్, బండి వంశి, కాకనూరు విజయ్, జానకి రాముడు, సత్యం, రామ్మోహన్, గౌండ సుబ్బా, గడ్డగాల బాలు, తదితర 35 కుటుంబాలు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బీసీ జనార్దన్ రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరడం జరిగింది. ఈ సందర్భంగా బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి ఏ కష్టం వచ్చిన అండగా ఉంటామని, ప్రతి ఒక్కరికి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు బొబ్బల గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ ప్రారంభం

విశాలాంధ్ర –ఉయ్యాలవాడ: గత రెండు రోజులుగా జరుగుతున్న పింఛన్ డ్రామాకు బుధవారం తెరపడింది. ఎన్నికల కమిషన్ వాలంటీర్లను ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందజేసేందుకు వీలు లేదని ఆదేశించిన విషయం తెలిసిందే. వాలంటీర్ల విషయంలో అధికార వైసీపీ , ప్రతిపక్ష పార్టీ తెలుగుదేశం రెండు రోజుల నుండి ఒకరిపై ఒకరు పలు విమర్శలు చేసుకున్నారు. ఎట్టకేలకు బ్యాంకు ఖాతాల్లో పింఛన్ సొమ్ము జమ కావడంతో నగదును పంచాయతీ కార్యదర్శులు బ్యాంకు నుండి తీసుకుని వచ్చి బుధవారం సాయంత్రం నాలుగు గంటల నుండి లబ్ధిదారులకు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఎంపీడీవో రఘురాం మాట్లాడుతూ 11 గ్రామ సచివాలయాల పరిధిలో 3,983 మంది లబ్ధిదారులకు ఆయా గ్రామ సచివాలయంలో పింఛన్లు అందజేయనున్నట్లు వెల్లడించారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న టీడీపీనేత ఎన్ఎండీ ఫిరోజ్

విశాలాంధ్ర – నంద్యాల : పట్టణంలోని చాంద్ బడాలో ఉన్న మసీద్ ఏ బదర్, పాన్ పట్టిలో ఉన్న మసీద్ ఏ ఆర్బాత్ లో నిర్వహించిన ఇఫ్తార్ విందులో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ చాంద్ బడా లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని, ఈ రంజాన్ పండుగను ముస్లిం సోదరులు సోదరీమణులు అందరూ సంతోషంగా జరుపుకోవాలని ఆ అల్లా దీవెనలు అందరిపై ఎల్లప్పుడూ ఉండాలని దువా నిర్వహించారు. అనంతరం మసీద్ కమిటీ సభ్యులు ఫిరోజ్ ను శాలువాలతో సత్కరించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ హనీఫ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నియోజకవర్గ టీడీపీ నేతలతో సమీక్ష

విశాలాంధ్ర –గూడూరు : కోడుమూరు నియోజకవర్గ నేతలతో గూడూరు పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ టిడిపి, బిజెపి, జనసేన ఉమ్మడి అభ్యర్థి దస్తగిరి, నియోజకవర్గ సీనియర్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, ముఖ్య నేతలతో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర యాదవ్, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్, జిల్లా పార్టీ అధ్యక్షుడు బిటి నాయుడు, ఎంపీ సంజీవ్ కుమార్‌లు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా నియోజకవర్గ, మండల స్థాయిలో కార్యాలయాల ఏర్పాటుకై ప్రాంగణాలను ఎంపిక చేసేందుకు నేడు గూడూరు, కోడుమూరుకు రావడం జరిగిందని గూడూరు కేంద్రంగా టీడీపీ నియోజకవర్గ కార్యాలయాన్ని త్వరలో ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు ,నియోజకవర్గ పరిశీలకులు, పార్టీ పెద్దలు అందరూ కలిసి మండల స్థాయి సమావేశాలు ఏర్పాటు చేసి సమన్వయ పరిచేవిధంగా దృష్టి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గజేంద్ర గోపాల్ నాయుడు నాయకులు సుద్దాల రాజు కురుకుంద రామాంజనేయులు మరియు కౌన్సిలర్లు నేతలు పాల్గొన్నారు

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

- బయటకు వచ్చేందుకు జంకు తున్న ప్రజలు
- మధ్యాహ్నం ఖాళీగా దర్శనమిస్తున్న రహదారులు
- రహదారులపై చలువ పందిర్లు ఏర్పాటు చేసిన అధికారులు
- వడదెబ్బకు గురవుతున్న ప్రయాణికులు

విశాలాంధ్ర – కల్లూరు: రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో ప్రజలు ఆరుబయట్ట తిరగాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని తిరిగే పరిస్థితులు నెలకొంటున్నాయి. జిల్లాలో ఈ ఏడాది ఉష్ణోగ్రతలు పెరిగి సూర్యుడు భగ భగ మండుతుండడంతో ప్రజలు ఉదయం సూర్యోదయం అయినప్పటినుండి సాయంత్రం సూర్యుడు అస్తమించే వరకు ఎండలు విపరీతంగా ఉండడంతో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటికి వచ్చేందుకు జంకుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు వ్యవసాయ భూముల్లో పనులు చేసుకునేందుకు తెల్లవారుజామున నాలుగు గంటలకు వెళ్లి ఉదయం 10 గంటల లోపే పనులు ముగించుకొని ఇళ్ళకు వచ్చే పరిస్థితిలో దాపరిస్తున్నాయి. దినసరి కూలీలు భవన నిర్మాణ కార్మికులు తదితర రకాల పనులు చేసే ప్రజలు ఉదయం 10 దాటిందంటే వ్యవసాయ కూలీలు ఎండ వేడిమికి తట్టుకోలేక పొలాల గట్టు లో ఉన్న చెట్ల కింద పనులు నిలిపివేసి సేదతీరే పరిస్థితులు నెలకొంటున్నాయి. సాయంత్రం అయిన తర్వాత పొలాలకు వెళ్లి మిగిలిన పనులను పూర్తి చేసుకొని ప్రజలు తమ పనులు నెట్టుకొస్తున్నారు. మూగజీవాలు, గొర్రెలు పశువులు పొలాల్లో వేసేందుకు వెళ్లి ఎండ తీవ్రత ఎక్కువయి వడ దెబ్బకు గురవుతున్న తరుణంలో వాటి కాపర్లు మూగజీవాల శాతం చెట్ల కింద ఆపుకుని నీటిని తాపీ ఎండ తీవ్రత నుండి కాపాడుకుంటున్నారు. జాతీయ రహదారి 44 బళ్లారి చౌరస్తా నుండి ఎర్ర కత్వ క్రాస్ రోడ్డు వరకు దాదాపు 40 కిలోమీటర్ల మేర రహదారి వెళ్తుంది. రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు మధ్యాహ్నం వేళల్లో రోడ్డు పక్కన ఉన్న చెట్ల కింద వాహనాలు దగ్గర ఉన్న షెడ్ల దగ్గర వాహనాలు నిలుపుకొని గంటల తరబడి కాలక్షేపం చేస్తూ ఎండల తీవ్రత తగిన తర్వాత అక్కడి నుంచి వాహనాలను తీసుకొని వెళ్తున్నారు. నాగలాపురం గ్రామం నుండి బళ్లారి చౌరస్తా ఆంజనేయస్వామి గుడి వరకు దాదాపు 30 కిలోమీటర్ల మేర బళ్లారి వెళ్లే రహదారి కల్లూరు మండలం మీద విస్తారంగా వెళ్తుంది. ఉష్ణోగ్రతలు అధికమవడంతో ఆ రహదారి గుండా వెళ్లే ప్రయాణికులు రోడ్డులో ఉన్న చెట్ల దగ్గర రహదారికి ఇరువైపులా ఉన్న వెంచర్లలోని చెట్ల దగ్గర వాహనాలు నిలుపుకొని సేద తీరుకున్నారు. ఎండలు మండుతున్న పశ్చిమ ప్రాంతం నుండి వందలాదిమంది భక్తులు, శ్రీశైలంకు ఉగాది పండుగను పురస్కరించుకొని తమ భక్తిని చాటుకునేందుకు మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు కుటుంబ సమేతంగా రోడ్లకు ఇరువైపులా ఎండల సైతం లెక్కచేయకుండా శ్రీశైలం వెళ్లేందుకు బారు బార్లుగా వెళ్తున్నారు. ఎండల తీవ్రత అధికమైనప్పుడు రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్ల కింద భక్తులు ప్రయాణికులు సేద తీరుతూ వారి ప్రయాణాలను నిత్యం సాగిస్తూ తమ భక్తిని చాటుకుంటున్నారు. వాహనదారులకు పాదాచార్ల కోసం కొంతమంది దాతలు టెంట్లు వేసి ప్రయాణికులకు మంచినీరు మజ్జిగ ఉచితంగా అందజేస్తున్నారు. మరి కొంతమంది ప్రయాణి కుల సౌకర్యార్థం మంచినీరు చలివేంద్రలు ,చల్లనీటి ఫ్రిడ్జను ఏర్పాటు చేసి పాదాచార్లకు వాహనదారులకు మంచినీటిని అందజేస్తున్నారు. పాఠశాలలకు ప్రభుత్వాలు మధ్యాహ్నం వరకు ఒక పూట బదులు నిర్వహిస్తున్నడంతో పిల్లలు తిరిగి ఇంటికి వెళ్లే సమయం ఎండల తీవ్రత ఎక్కువై వాటి నుండి తమను తాము కాపాడుకునేందుకు గొడుగులు , టవాళ్లను, టోపీలు తదితర వాటిని ధరిస్తూ ఎండల బారిన పడకుండా కాపాడుకుంటున్నారు. ఏది ఏమైనా ఎండలు రోజురోజుకు తీవ్ర మవుతుండడంతో వృద్ధులు పిల్లలు వడదెబ్బకు గురయ్య ప్రమాదాలు అధికంగా ఉండడంతో వారిని అత్యవసరమైతే తప్ప ఎండలో తిరగకుండా చూసుకోవాల్సిన జాగ్రత్తలు కుటుంబ పెద్దలపై ఉందని అలాగే ప్రభుత్వ అధికారులు రహదారులపై వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం ప్రధాన కోడలలో చలువ పందిర్లు ఏర్పాటు చేసి వాహనదారులు వడదెబ్బకు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కొన్ని కూడాల్లో అధికారులే చలివేంద్రలు ఏర్పాటు చేసి మంచినీటిని సరఫరా చేస్తున్నారు. ఏది ఏమైనా ఎండల తీవ్రత రోజుకు తీవ్రమవుతున్నాడంతో అత్యవసరమైతే తప్ప ఎండల్లో తిరగకూడదని వడదెబ్బ గురైనప్పుడు తగు జాగ్రత్తలు తీసుకొని సంబంధించిన వైద్యులను సంప్రదించి వైద్య సేవలు తీసుకోవాలని మేధావులు వైద్యులు పలువురు సూచిస్తున్నారు. వేసవికాలంలో ఘన పదార్థాల కన్నా ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకొని ఎండల బారి నుండి తమని తాము కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైన ఉంది.

మోమిన్ అహ్మద్ హుస్సేన్ టీడీపీకి రాజీనామా

విశాలాంధ్ర – ఆత్మకూరు టౌన్ : పట్టణంలోని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్, రాష్ట్ర హజ్ కమిటీ మాజీ చైర్మన్ మోమిన్ అహమ్మద్ హుసేన్ స్వగృహం వద్ద పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మోమిన్ అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ 35 సంవత్స రాలుగా తెలుగుదేశం పార్టీలో ఎన్ని అవాం తరాలు ఎదురైనా, పార్టీలో ఎన్ని సంక్షోబాలు వచ్చినా నిలదీక్కుకొని ముందుకు వెళుతూ పార్టీని కాపాడుకుంటూ వచ్చిన స్థానిక ఇంఛార్జి బుడ్డా వైఖరితో పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఆయనతో పాటు ఆయన కుటుంబ సభ్యులు,టీడీపి నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున అపార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు కు,నారా లోకేష్ కు,అచ్చెన్నాయుడు తదితరులకు తన రాజీనామా లేఖను అందజేసినట్లు తెలిపారు. తాను కుటుంబ నేపథ్యంతో రాజకీయంలో వచ్చినవాడి ని కాదని మా తండ్రి గాని మా తాత గాని ఎమ్మెల్యేలు ఎంపీలుగా లేదా రాజకీయాల్లో ఉన్నవారు కాదని నేను స్వతహాగా రాజకీయంగా ఎదిగి ప్రజాసేవచేసి ప్రజల మన్ననలు పొందిన నాయకుడని తెలిపారు. తెలుగుదేశం పార్టీకి 35 సంవత్సరాలుగా అలుపెరగకుండా సేవ చేశానని ఎంతో నిబద్ధతతో నీతి నిజాయితీతో పనిచేశానని రాష్ట్ర పార్టీ పరిశీల కుడిగా దాదాపు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో పనిచేశానని గుర్తు చేశారు. పార్టీ విషయానికి వచ్చినప్పుడు కుటుంబాన్ని కూడా లెక్క చేయకుండా పార్టీ బలోపేతానికి కృషి చేశానన్నారు. ఇంత సేవ చేశాను కాబట్టే పార్టీ తన సేవలను గుర్తించి రెండుసార్లు రాష్ట్ర చైర్మన్ పదవి ఇస్తే రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీలకు న్యాయం చేశానని సామాన్య ప్రజలకు సేవ చేశారని అన్నారు. తన రాజకీయ ప్రస్థానంలో ఎవరినీ కీడు చేసిన వ్యక్తినే కాదని ఒక్క అవినీతి ఆరోపణ కూడా లేదని ఆదర్శ వంతమైన రాజకీయాలకు నాంది పలికానని గుర్తు చేశారు. నా మొదటి ప్రాముఖ్యతగా నా పార్టీ తరువాత నా కార్యకర్తలు తర్వాత నా కుటుంబ సభ్యులుగా భావించారన్నారు. ప్రస్తుత టిడిపి ఇంచార్జ్ బుడ్డ రాజశేఖర్ రెడ్డి విషయానికొస్తే 20 సంవత్సరాలుగా ఎన్నో అవమానాలకు గురిచేసి నన్ను నా కార్యకర్తలను మనం నమ్ముకున్న వారిని తీవ్ర ఇబ్బందులు పెట్టడం ఆయనకు అలవాటు అన్నారు. ఆయన తండ్రికి ఆత్మకూరులో తీసుకు వచ్చిన ఘనత నాదేనని వారి కుటుంబానికి మొత్తం సేవ చేస్తే నాకువారు దగా చేశారని తెలిపారు. ప్రతిక్షణం నన్ను నా కార్యక ర్తలను ఇబ్బంది పెట్టడం ఆమాణాల్లో గురి చేయడం నేను ఎక్కడ తన రాజకీయ భవిష్యత్తుకు అడ్డువస్తానని అభద్రతా భావంతో ప్రతిసారి రాష్ట్ర పార్టీకి నా మీద చాడీలు చెప్పడం ఆయనకు అలవాటు అన్నారు. ఇన్ని అవమానాలు భరిస్తూనే మరోవైపు పార్టీ నాకిచ్చిన బాధ్యతలు నిర్వర్తిస్తూ రాష్ట్రవ్యాప్తంగా సొంత డబ్బులతో ఖర్చు చేసి పార్టీ బలోపేతం కోసం తిరిగానని గుర్తు చేశారు. త్వరలోనే వైఎస్సార్సీపీ పార్టీలో చేరుతున్నానని, శిల్పా చక్రపాణి రెడ్డితో కలిసి పనిచేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మోమిన్ ముస్తఫా మోమిన్ ఇస్మా యిల్ జబిల్ల గౌస్ మాలిక్ జాకీర్ హుస్సేన్, ఇలియాస్ కలీముల్లా జబివుల్లా హబీబుల్లా కు, సలాం, మహబూబ్, షఫీ ఉల్లా, గఫూర్,జాకీర్, ఖాదర్ వలీ, నబిసా,షాకీర్, అబ్దుల్ పాల్గొన్నారు.

తర్తూరు జాతరలో భక్తులకు సమస్యలు తలెత్తనివ్వము

- 17 నుంచి తర్తూరుకు ఆర్టీసీ బస్సుల ఏర్పాటు
- జాతరలో తాగునీటి ఎద్దడి నివారణకు పటిష్ట చర్యలు

విశాలాంధ్ర – జూపాడుబంగ్లా: శ్రీ లక్ష్మీ రంగనాథుని జాతరలో భక్తులకు ఎలాంటి సమస్యలు తలెత్తని వ్వమని వివిధ శాఖల మండల అధికారులు తెలిపారు. బుధవారం శ్రీ లక్ష్మీ రంగనాథ స్వామి వారి ఆలయంలో ఆలయ ఈవో వెంకటరమణ ఆధ్వ ర్యంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష సమా వేశం నిర్వహించారు. జాతర ఈనెల 17 నుంచి నిర్వహించే స్వామివారి బ్రహ్మోత్సవాలకు వేలాదిమంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. వివిధ ప్రాంతాల నుంచి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలకులోను కాకుండా తీసుకోవాల్సిన పటిష్ట చర్యలపై చర్చించారు. జాతరకు వచ్చే భక్తులకు ఈనెల 17 తారీకు నుంచి నందికొట్కూరు డిపో నుంచి ఆర్టీసీ బస్సులు తిప్పుతామని ఆర్టీసీ డిపో ఏ డి సి శ్రీనివాసులు తెలిపారు. అదేవిధంగా భక్తుల సౌకర్యం కోసం ఆత్మకూరు నుంచి తర్తూరు జాతరకు ప్రత్యేకంగా బస్సులు తిప్పుతామని వారు తెలిపారు. జాతరలో గ్రామపంచాయతీ తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపడతామని పంచాయతి అధికారులు తెలిపారు. 17వ తారీకు నుంచి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని పారు మంచాల వైద్యులు యశస్విని తెలిపారు. గ్రామంలో ఆరోగ్య కేంద్రం ఉన్నప్పటికీ 23 నుంచి ప్రత్యేకంగా వైద్య శిబిరం నిర్వహించి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి సమస్యలు తెలుత్తకుండా చేస్తామని పారుమంచాల వైద్యులు తెలిపారు. అలాగే ఎద్దుల కోసం పశు వైద్య శిబిరం కూడా నిర్వహిస్తామని వైద్యాధికారి రాగ సంధ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పీఎం నాగిరెడ్డి, ఆలయ ఈవో వెంకటరమణ, పంచాయతీరాజ్ ఏఈ బషీర్, విద్యుత్ శాఖ ఏఈ రామాచారి, జూపాడు బంగ్లా ఎస్సై లక్ష్మీనారాయణ, ఎక్సైజ్ ఎస్సై నాగరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎల్పీ నెంబర్ల ఆధారంగా రిజిస్ట్రేషన్లు

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు : జిల్లాలో రీ సర్వే జరిగిన గ్రామాలలో ఎల్ పి(ల్యాండ్ పార్శిల్) నెంబర్ల ఆధారంగా భూములు రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య పేర్కొన్నారు.బుధవారం కలెక్టరేట్ లోని మిని కాన్ఫరెన్స్ హాలులో భూముల రిజిస్ట్రేషన్లకు సంబంధించి మార్కెట్ విలువల నిర్ధారణ కమిటీ తో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ జిల్లాలో భూముల రీ సర్వే జరిగిన గ్రామాలలో సర్వే నెంబర్లతో పని లేకుండా ఎల్ పి నెంబర్లు ఆధారంగా భూముల రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చునన్నారు. రీ సర్వే జరిగిన గ్రామాలలో కొత్తగా అమలులోకి వచ్చిన ఎల్ పి (ల్యాండ్ పార్శిల్) నెంబర్లకు ప్రస్తుతం సర్వే నెంబర్ల ను మార్కెట్ భూముల విలువలతో మ్యాప్ చేయడమైనది. ఇందులో మార్కెట్ విలువలు ఎలాంటి పెంపుదల ఉండదని ప్రజలు గమనించగలరన్నారు. ఇక మీదట రీ సర్వే జరిగిన గ్రామాలలో ఎల్ పి నంబర్ల ఆధారంగానే రిజిస్ట్రేషన్ చేసుకునే సౌలభ్యం కల్పించడమైనదని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో నాసర రెడ్డి, జిల్లా రిజిస్ట్రార్ నాగలింగేశ్వరరావు, కుడా వైస్ చైర్మన్ ప్రతాపరెడ్డి, సబ్ రిజిస్ట్రార్స్, తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీమారెమ్మ దేవత విగ్రహ ప్రతిష్ట

విశాలాంధ్ర – తుగ్గలి:మండల పరిధిలోని రోళ్ళపాడు తండాలో ఏప్రిల్ 4వ తేదీన మారెమ్మ దేవత విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అమర్నాథ్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా వైసీపీ నాయకుడు ఊటకంటి అమర్నాథ్ రెడ్డి మాట్లాడుతూ గిరిజనులు ఆరాధ్య దైవం అయినటువంటి మారెమ్మ దేవత ను రోళ్ళపాడు తండాలోని గిరిజనుల కోరిక మేరకు తన సొంత డబ్బులుతో తండాలో మారెమ్మ దేవత ఆలయాన్ని నూతనంగా నిర్మించి ఆలయంలో మారెమ్మ దేవత, బొడ్డురాయి, నాగదేవత ల ను ప్రతిష్ట చేస్తున్నట్లు తెలిపారు.4వ తేదీ న ప్రముఖ వేద పండితుడు బేల్దోన్ స్వామి ఆధ్వర్యంలో మారెమ్మ దేవత, బొడ్రాయి, నాగదేవత ల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇక్కడికి వస్తున్న భక్తాదులకు అన్నదాన కార్యక్రమాన్ని కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే శ్రీ దేవి వస్తున్నట్లు అమర్నాథ్ తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధిని చూసి ఓటేయండి

విశాలాంధ్ర–కోసిగి : సంక్షేమం అభివృద్ధిని చూసి వైసిపి ప్రభుత్వానికి ఓటేయాలని మండల ఇంచార్జ్ మురళీమోహన్ రెడ్డి అన్నారు. మంత్రాలయం వైసీపీ ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు బుధవారం మండల పరిధిలోని డి.బెళగల్, ఐరనగల్ గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవరత్నాల పథకాలతో ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరిందన్నారు. పార్టీలకతీతంగా కులాలు మతాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి వైసిపి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందించామన్నారు. వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రతి 50 కుటుంబాల్లో ఏ అవసరం వచ్చినా సంక్షేమ పథకాలు అందజేయాలన్న వాలంటీర్లు కీలకపాత్ర పోషించారని అయితే చంద్రబాబు నాయుడు దురుద్దేశంతో వాలంటీర్లు వ్యవస్థను నాశనం చేయాలనుకుంటున్నారని, ఆ ప్రభావమం ఎలా ఉంటుందో మనకు ప్రస్తుతం అర్థమవుతుందన్నారు. ఈనెల పెన్షన్లు పంపిణీ విషయంలో అవ్వ , తాతలకు ,వికలాంగులు , ఒంటరి మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సచివాలయ సిబ్బందితో ఒకటి రెండు రోజుల్లో జగనన్న పెన్షన్లు పంపిణీ చేయిస్తాడని హామీ ఇచ్చారు. మీ అమూల్యమైన రెండు ఓట్లను ఫ్యాను గుర్తుపై వేసి ఎమ్మెల్యే అభ్యర్థి అయిన బాలనాగిరెడ్డికి , ఎంపీ అభ్యర్థి అయిన బి వై రామయ్య ను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఎంపీపీ పెండేకల్లు ఈరన్న ,మండల కన్వీనర్ బెట్టన్న గౌడ్, శ్రీనివాసరెడ్డి, జగదీష్ స్వామి, ఐరనగల్. రామాంజనేయులు, భీమ్ సేన, నాడుగేని నాగరాజు, దొడ్డి నరసన్న, ఆయా గ్రామాల నాయకులు గృహ సారథులు, క్లస్టర్ ఇన్చార్జులు తదితరులు పాల్గొన్నారు.